

# స్పీడ్ బ్రేకర్

## మధురాంతకం నరేంద్ర

"నిన్న జరిగిన ఇంటర్వ్యూ సంగతేమిటో యిప్పుడు చెప్పరా చంద్రా!" కాఫీతాగడం ముగిశాక నింపాదిగా అడిగాడు సాగర్

కాగితం పువ్వులా వెలవెలబోయే నవ్వొకటి నవ్వి "ఆ ఆశగూడా అడుగంటిపోయింది" అన్నాడు చంద్రమౌళి

"అదేమిట్రా! ఆ ఆఫీసరు మీ నాన్నగారికి బెస్ట్‌ఫ్రెండన్నావు గదా!"

"బెస్ట్‌ఫ్రెండ్ కావడం వల్లే అది రాలేదు"

"అంటే!!"

"నాకేమీ సహాయం చెయ్యవద్దని మా నాన్నగారు తన స్నేహితులందరికీ ముందే జాగ్రత్తపడి చెప్పిపెట్టారు"

కాస్సేపు విస్మయంలో మునిగిపోయిన సాగర్ తరువాత తేరుకుని "ఆ విషయం నీకెలా తెలిసింది?" అని అడిగాడు

"ఆ ఆఫీసరే చెప్పాడు"

సాగర్ స్నేహితుడి వైపు జాలిగా చూశాడు

ఒకప్పుడీదేవ్యక్తిలో ఎంత ఆత్మ విశ్వాసం, ఎంత చురుకుతనం వుండేవి! దైన్యం మాడివుడి నెంత దిగజారుస్తుంది! మొఖం పీక్కుపోయి వుంది వారం రోజుల వయసున్న గెడ్డం మనసులోని బాధనంతా బయట పెడుతోంది బట్టలు నలిగిపోయి వున్నాయి

చంద్రమౌళిని ఆ పరిస్థితిలో చాలా సేపు చూడలేకపోయాడు సాగర్

"ఒక అర్జెంటు పనుందిరా చంద్రా! నేను వెళ్ళాలి అన్నట్టొక మాట— ఇప్పుడు డబ్బేమయినా కావాలా? మొహమాట పడకుండా అడుగు"

"స్నేహితుల మధ్యలో డబ్బుకు సంబంధించిన లావాదేవీ లేమీ వుండగూడదన్న నియమం నాకొకప్పు డుండేదిరా సాగర్! కానీ "

"నీ నీతులూ, నియమాలూ కాస్త కట్టి పెట్టు – 'ఏ ఫ్రెండ్ యిన్ నీడ్ –

ఈజె ఫ్రెండ్ యిండీడ్' అని వూరికే అన్నారా చెప్పు ఆ సంగతి సరేలే యిప్పుడు డబ్బెంతకావాలి? "

"ఈ నెల గడవాలిగా కనీసం అయిదువందలైనా "

సాగర్ కాస్సేపు ఆలోచించి తరువాత చేతివాచీ తీసి అతడి ముందుంచుతూ "నా దగ్గర ప్రస్తుతానికంత డబ్బులేదు ఈ వాచీ తీసుకో అమ్మితే అయిదొందలు రావచ్చు" అన్నాడు

"వాచీయా? ఇంట్లో అడిగితే ఏం చెబుతావు?" అన్నాడు చంద్రమౌళి తీసుకోడానికి సందేహిస్తూ

"నేనేమైనా చెప్పుకుంటాన్లే ఇక నేను వెళ్ళనా?"

స్నేహితుడి మంచితనానికి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతూ వుండగా, గొంతు పెగలకపోవడంతో సరేనన్నట్టుగా తల వూపాడు

సాగర్ గబగబా హోటలు బయటికొచ్చి, కారు తలుపు తెరిచి కూర్చుని స్టార్టుచేశాడు

కారు పరిగెత్తసాగింది

డ్రైవ్ చేస్తూనేవున్నా అతడి ఆలోచనలన్నీ చంద్రమౌళిపైనే వున్నాయి

జీవితంలో పొరబాటు చేయడానికి క్షణంసేపే చాలు! కానీ క్షణం చేసిన పొరబాటుకు జీవితమంతా బాధపడవలసి వుంటుంది తాత్కాలికమైన ఆనందానికి లొంగిపోయి శాశ్వతానందాన్ని దూరం చేసుకోవడం మానవ స్వభావంలా కనబడుతుంది

'అప్పుడు తానుగూడా చంద్రమౌళి లాగా తిరగలేక పోయినందుకు బాధ పడ్డాడు కానీ అప్పుడు తాననుకున్నట్టే జరిగుంటే ?'

ఆ ఆలోచన రాగానే భయంతో ఒకసారి వులిక్కిపడ్డాడు సాగర్

## 2

"ఎటూ ఈ రోజూ, రేపూ సెలవే గదమ్మా! మేమంతా హార్లీస్‌హిల్స్‌కు పిక్నిక్ వేసుకున్నాం రేపు సాయంకాలానికంతా తిరిగొచ్చేస్తాం " ఉదయం ఎనిమిది గంటల సమయంలో టిఫెన్ తింటూవుండగా అన్నాడు సాగర్

"మేము — అంటున్నావు ఎవరెవరు వెడుతున్నారు?" అంటూ ప్రశ్నించారు రఘుపతిరావుగారు

"వాలా మందేమీగాదులే నాన్నా నేనూ యింకో ఫ్రెండూనూ "

అతడి కంఠంలోని తడబాటును అర్థంచేసుకున్నట్టుగా "ఫ్రెండంటే— అరుణ గాదుగా " అంటూ ప్రశ్నించింది జయలక్ష్మమ్మ

సాగర్ సమాధానం చెప్పలేదు

సంగతేమిటో అర్థమయినట్టుగా తల వూపారు రఘుపతిరావుగారు

"పెళ్ళి గాకముందే అలా తిరగడం మంచిపని గాదురా సాగర్ "

"ఎవరైనా చూసిన వాళ్ళేమను

కుంటారు చెప్పు? వద్దురా సాగర్ అలా వెళ్ళడం బాగుండదు

తల్లిదండ్రులిద్దరూ తనను వ్యతిరేకించడంతో చెప్పలేనంత చిరాకేసింది అతడికి అయినా మెల్లగా ప్రాధేయ పడుతున్నట్టుగా "ఈ ఒక్కసారికే వద్దనకమ్మా! " అన్నాడు

"పొరబాటు ఒకసారి చేసినా, వంద సార్లు చేసినా ఒకటే వద్దురా సాగర్- అలాంటి అడ్డుదార్లు నీకొద్దు నీవలా వెళ్ళడానికి వీల్లేదు" తండ్రి కంఠంలో వినిపించిన కరుకుదనానికి కంగారు పడ్డాడు సాగర్ సాధారణంగా రఘుపతి రావుగారు కొడుకును అజ్ఞాపించరు నచ్చ జెప్పడానికే ప్రయత్నిస్తారు అలాంటి వ్యక్తి అలా కచ్చితంగా వద్దనడంతో సమాధాన మివ్వలేక పోయాడు మాటిమాటికీ ప్రాధేయపడి తాయిలం కోసం విసిగించేటందుకు సాగర్ చిన్నపిల్లాడుగాడు అందుకే ముఖాన్ని కందగడ్డలా చేసుకొని పైకి లేచి లోపలికి వెళ్ళిపోయాడు

పదిహేను నిముషాల తరువాత బట్టలు మార్చుకొని బయటికి వెడుతూ "వెళ్ళొస్తాను" అన్నాడు

"త్వరగా వచ్చేస్తావా?" అంది జయలక్ష్మమ్మ

ఆమె మనసులోని భావం అర్థ మయ్యింది అతడికి

"రానయినా చెప్పిరావాలిగా" అంటూ విసురుగా బయటికి నడిచాడు షెడ్‌లోనుంచి కారు బయటికి తీసి హోటల్ ఊర్వశివైపు పరిగెత్తించాడు

చెప్పినట్టుగానే హోటల్లో కూర్చుని తనకోసం ఎదురుచూస్తూ వున్నాడు చంద్రమౌళి అతడి పక్కనే గీతాదేవి కూడా కూర్చొనివుంది అప్పటికే కాఫీ టిఫెన్లు సేవించడం ముగించినట్టున్నారు యిద్దరూ సిగరెట్టు కాల్చుకుంటూ ఆమెతో కబుర్లు చెబుతున్నాడు అతను

సాగర్‌ను చూడగానే 'హాయ్!' అంటూ విష్ చేశాడు "సరిగ్గా చెప్పిన సమయానికే వచ్చేశావ్! అన్నట్టు ఒక్కడివే వచ్చావేమిటి? అరుణగారు రానన్నారా?" అంటూ ప్రశ్నించాడు

"అరుణ మాత్రమే గాదు, నేనుగూడా రావడంలేదు" అన్నాడు, సాగర్

"అదేమిట్రా, తీరామేము బయల్దేరేసిన తరువాత అలా అంటున్నావు అరుణగారు నీతో రావడానికి నిరాకరించారా ఏమిటి?" విస్తుపోతూ అడిగాడు చంద్రమౌళి


"అదేంగాదు"

"మరి? "

"మా నాన్నగారే వద్దన్నారు "

"కారణం? "

"పెళ్ళిగాక ముందే యిలా తిరగడం ఆయనగారికి యిష్టంలేదట! నేనలా అడ్డుదార్లలో తిరగడం ఆయనకు నచ్చదట! "




"ఇందులో అడ్డుదారనే ప్రసక్తి ఏముందిరా సాగర్ — మీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారు పైగా మీ అమ్మా నాన్నా గూడా అందు కంగీకరించారు కదా ఇక అడ్డేముంది చెప్పు? "

"అదే నాకూ అర్థంగావడంలేదు "

ఆశాభంగం వల్ల బాధపడుతున్న స్నేహితుడి ముఖం చూడ్డానికి జాలిగా వుంది చంద్రమౌళికి "పోనీలేరా సాగర్ కాఫీ తెప్పించనా?" అంటూ అడిగాడు

"మరి మీరు "

"మేం ఏకంగా టిఫెను గూడా ముగించాంలే! నువ్వు తీసుకో "

సర్వర్‌ను కేకేసి కాఫీ తెప్పించాడు చంద్రమౌళి

మౌనంగా కాఫీ తాగసాగాడు సాగర్

"ఇంత చిన్న విషయానికి గూడా మీ అమ్మా నాన్నల్ని ఎదిరించలేవట్రా?" మెల్లగా అడిగాడు చంద్రమౌళి

"నా వల్ల కాదురా చంద్రా! దటీజ్ మై వీక్‌నెస్ నేను వాళ్ళను ఎదిరించ లేను చిన్నతనంనుంచీ అలా అలవాటై పోయింది అంతేగాదు, నేను వాళ్ళతో అబద్ధంగూడా చెప్పలేను ముందుగానే నాలుగయిదు రిహార్సల్స్ చేసుకొని వెళ్ళినా వాళ్ళ ముఖం చూడగానే అబద్ధం చెప్పడానికి తడబడిపోతాను. నేను తడబడ్డానంటే వెంటనే వాళ్ళ కర్థమైపోతుంది నేను అబద్ధం చెబుతున్నానని "

"నో, నో, నో — నువ్వేమైనా అను కోరా సాగర్ — నువ్వేమైనా చిన్న పిల్లాడివా చెప్పు — అన్నింటికీ వాళ్ళెందుకలా అడ్డంకులు పెడతారు?

కొడుకుగానీ, కూతురుగానీ, ఒక వయసుకు వచ్చేశాక తల్లిదండ్రులు వాళ్ళను పట్టించుకోవడం మానేయాలి. తమ మంచీ, చెడూ తాము ఆలోచించుకునే స్థితికి వచ్చిన తరువాత పిల్లల్ని తమతో సమానంగా స్నేహితుల్ని చూసినట్టుగా చూడాలి. అలా ప్రవర్తించడమేరా కల్చరంటే.... పల్లెటూరి గబ్బిలాయిల్లా ప్రతి విషయానికీ సలహా యివ్వబోవడమూ, అడ్డంకులు కల్పించడమూ కల్చరనిపించుకోదు. ఫర్ ఎగ్జాంపుల్ — మా నాన్నగారినే తీసుకో.... నేను పుట్టినప్పటినుంచీ నన్నెప్పుడూ ఆయన కాదనలేదు. నేనాడింది ఆటగా, పాడింది పాటగా పెరిగాను. బిజినెస్ గొడవల్లో ఆయనెప్పుడూ బిజీగా వుంటారు. అంతెందుకు — నేనుగానీ, మా తమ్ముడుగానీ రిజల్ట్సు వచ్చిన తరువాత 'ఫాసయ్యాను నాన్నా!' అని చెప్పామనుకో. 'అరె! మీ పరీక్షలెప్పుడు జరిగాయిరా' అంటూ ఆశ్చర్యపడిపోయి ఏదో ఒక ప్రజెంటేషన్ తీసుకొస్తారు. ఇక మా అమ్మందనుకో — ఆవిడకు ఎప్పుడూ క్లబ్బులు, మీటింగుల గొడవే.... మా కెవరికైనా జబ్బొచ్చి నయమయ్యాక 'నీకు జబ్బొచ్చినట్టు నాకు చెప్పలేకపోయావా? మంచి డాక్టర్ని పిలిపించేదాన్నిగా !' అంటూ పలకరిస్తుంది. ఒకొకప్పుడు నేను మా వాళ్ళు మమ్మల్ని పట్టించుకోవడంలేదని బాధపడేవాణ్ణి. కానీ నీ పరిస్థితి చూసిన తరువాత అర్థమయ్యింది — నేనెంత సుఖపడుతున్నానో.... పోనీలే.... బెటర్ లక్ నెక్ట్స్‌టైమ్...."

మిత్రుడి మాటలు సాగర్‌లో మరింత కల్లోలాన్ని కలిగించాయి. నిజమే! చంద్రమౌళి అదృష్టవంతుడు. అతడేం చేసినా వాళ్ళ తల్లిదండ్రులు పట్టించుకోరు. మరితన తల్లిదండ్రులు?

అంతవరకూ వాళ్ళ మాటలమధ్య శ్రోతగానే వుండిపోయిన గీతాదేవి నోరు తెరిచింది — "మీరు బలే వాళ్ళండీ! అవతల ఆయన అలా బాధపడుతుంటే అలాగేనా ఓదార్చడం?" అంటూ చంద్రమౌళిని మెత్తగా మందలించింది.

"అరరే! నా మాటలు కఠినంగా వున్నాయంటావా గీతా! ఐయామ్ సో సారీరా సాగర్! నిజానికి నువ్వు రాలేకపోవడంవల్ల నాకు బాధేసింది. ఆ బాధలో అలా మాట్లాడేశాను. డోంట్ థింక్ అదర్‌వైజ్" అంటూ చంద్రమౌళి సాగర్‌ను ప్రాధేయపడ్డాడు.

"నెవర్‌మైండ్...ఉన్నమాటన్నావు... పోనీలేరా! దటీజ్ మై ఫేట్... నువ్వు మాత్రం ఏంచేస్తావు చెప్పు...." అన్నాడు సాగర్.

తరువాత మెల్లగా చెప్పసాగాడు — "నిజానికి గీతాదేవిగారి పేరంట్స్‌ను చూస్తే నాకు ఆశ్చర్యంగా వుంటుందిరా

చంద్రా! వాళ్ళ నాన్నగారు మామూలు గుమాస్తాయేననుకో.... కానీ ఆయనకు కూతురి పైన ఎంత నమ్మకం! ఈ రోజుల్లో కూతుర్ని తన కిష్టం వచ్చినట్టు తిరగనిచ్చే పేరెంట్సెవరుంటారు చెప్పు?"

గీతాదేవి వులిక్కిపడింది. ఆమె తండ్రి ఒక చిన్న వుద్యోగి. ఆయనకు కుమార్తెపైన ఎంతో నమ్మకమన్నమాట నిజం! కానీ ఆమె నిజంచెప్పి ఈ ప్రయాణానికి సిద్ధపడలేదు. ఓ స్నేహితురాలింటికి వెడుతున్నానని చెప్పింది. ఆమె అలా అబద్ధాలు చెప్పిరావడమూ, వాళ్ళిద్దరూ పిక్నిక్కులకూ, షికార్లకూ వెళ్ళిరావడమూ యింతకుమునుపు గూడా చాలాసార్లు జరిగింది. నిజానికి ఆమెకు చంద్రమౌళిపైన చెప్పలేనంత నమ్మకముంది. అందుకే యింట్లో అలా అబద్ధాలు చెప్పవలసి వచ్చినా — ఆమె భయపడడంలేదు. తనపైన తన తల్లిదండ్రులకు చాలా నమ్మకముండడం వల్లనే, అబద్ధాలు చెప్పి యిలా చంద్రమౌళితో తిరగగలుగుతున్నానని ఆమె చెప్పలేకపోయింది. సాగర్ మాటలు విన్నప్పుడామె అందుకే వులిక్కిపడటం జరిగింది. కానీ తన మనస్సులోని కంగారును బయటపడనివ్వకుండా ముఖంపైన ఒక నవ్వును పులుముకోవడంలో కృతకృత్యురాలైంది. ఆమెకు తన తల్లిదండ్రుల ప్రస్తావన రావడం రుచించక పోవడం వల్ల "అది సరేనండీ? మీ పేరెంట్సెంత స్ట్రిక్ట్‌గా వుంటారన్నారు... మరి మీరు ప్రేమించిన అమ్మాయితో మీ పెళ్లి జరగడానికి వాళ్ళెలా ఒప్పుకున్నారు?" అంటూ టాపిక్ మార్చడానికి ప్రయత్నించింది.

"ఎమ్. ఏ. ప్రీవియస్‌లో చేరిన కొంత కాలానికి నాకు అరుణతో పరిచయం కలిగింది. మేమిద్దరం కొద్దిగా తెగించి ఫ్రీగా సినిమాలకూ, షికార్లకూ వెళ్ళడానికి ప్రయత్నిస్తున్న సమయంలోనే ఎలా తెలిసిందో ఏమో — మా నాన్నగారికి యీ సంగతి తెలిసిపోయింది. తానెంతగా తన పనుల్లో మునిగి వున్నప్పటికీ మా నాన్నగారు నన్ను వేయి కళ్ళతో వెంటాడుతూనే వున్నట్టు నా కప్పుడుగానీ తెలిసిందిగాదు. ఒకరోజు నన్ను పిలిచి డైరక్టుగా 'ఎవరితోనో ఓ అమ్మాయితో తిరుగుతున్నావట, నిజమేనా?' అని అడిగేశారు. ఇది వరకే చెప్పాను గదా! — ఆయన ముందు నేనబద్ధమాడలేను. అందుకే ఏమీ చెప్పలేక తడబడిపోయాను. 'ఎవరా అమ్మాయ'ని గద్దించారు డాక్టరు రాధాకృష్ణమూర్తిగారి అమ్మాయని చెప్పాను. 'నీవలా తిరగడం నాకిష్టం లేదు, మానేయ్' అన్నారు కచ్చితంగా. నేను కొద్దిగా తెగించి 'నేనా అమ్మాయిని ప్రేమిస్తున్నాను' అని చెప్పేశాను. 'చదువుకుంటూ వున్నప్పుడు ప్రేమా,

గీమా అంటూ పిచ్చి తిరుగుళ్ళు తిరగడం నాకు నచ్చదు. ముందు సక్రమంగా చదువుకో. తరువాత వుద్యోగంలోనో, బిజినెస్‌లోనో — ఎందులోనో ఒక దాంట్లో స్థిరపడు. నీ కాళ్ళమీద నువ్వు నిలబడడానికి ప్రయత్నించడం నీవంతు. ఆ తరువాత ఏ అమ్మాయి నచ్చితే ఆ అమ్మాయితో నీ పెళ్లి జరిపించడం మా వంతు. అంతవరకూ అలా అమ్మాయిల వెంటపడి తిరుగుతూ నా మానం తీయ డానికి ప్రయత్నించావంటే నేనూరు కోను'— అన్నారు ఆయన. నాకప్పుడు ఆయన మాటలు సమంజసంగానే వున్నాయనిపించింది. అందుకే మునుప టిలా తిరగడం మానేశాను. తరువాత కొన్ని రోజులకు మా నాన్నగారు బిజి నెస్‌లో లాభాలు వచ్చినందుకు వాళ్ళ క్లబ్బు మెంబర్సుకంతా పార్టీయిచ్చారు. ఆ పార్టీకి అరుణ ఫాదర్ రాధాకృష్ణ మూర్తిగారు సతీసమేతంగా వచ్చారు. ఆయనగూడా మా నాన్నగారి క్లబులో మెంబరని నాకంతవరకూ తెలియదు. ఆ సందర్భంలో ఆమె పేరెంట్సూ, మా పేరెంట్సూ మాట్లాడుకుంటున్నప్పుడు గానీ.... మాకు తెలియకుండానే వాళ్ళు నాకూ అరుణకూ చదువులు పూర్తి య్యాక పెళ్లి చేయడానికి నిశ్చయించు కున్నారని తెలిసిందిగాదు...."

"లైన్‌క్లియర్ అవుతున్నట్టు తెలి సిందేమో— అప్పటినుంచీ మా వాడు అరుణతో మరి కొంచెం ఫ్రీగా తిరగడం మొదలెట్టాడు...." అంటూ నవ్వేశాడు చంద్రమౌళి.

"ఈ సంఘటనను బట్టి చూస్తే మీ పేరెంట్స్ మంచివాళ్లా చెడ్డవాళ్లా అన్నది అర్థంగావడంలేదండీ! మొత్తానికి వాళ్ళ ప్రవర్తన వింతగానే వుంది..." అంటూ తానుగూడా ఓ చిరునవ్వు నవ్వే సింది గీతాదేవి.

అంతలో ఏదో గుర్తుకు వచ్చిన వాడిలా రిస్ట్‌వాచీకేసి చూసి "అరరే! ఎెవన్ తర్టీ దాటుతోంది. వీడెలాగూ రాలేకపోయాడు.... ఇక మనం బయలు దేరుదామా గీతా!...." అన్నాడు చంద్ర మౌళి.

"మనమూ ఆగిపోతే పోదూ?" అంది గీతాదేవి.

"నో, నో... అనుకున్నది అను కున్నట్టుగా జరగకపోతే నాకు అదోలా వుంటుంది.... మనం వెళ్లాల్సిందే...." అనేశాడు అతను.

సాగర్ గూడా "నాకోసం మీరెందు కాగాలి?— వెళ్ళిరండి" అంటూ సాగ నంపాడు.

గీతాదేవితో కలిసి చంద్రమౌళి హార్లీస్‌హిల్స్‌వైపు ఆనందయాత్ర వెళ్లి పోయిన తరువాత జరిగిన సంగతి అరుణకు చెప్పడానికని సాగర్ రాధా కృష్ణమూర్తిగారి యింటివైపుకు కారును పోనిచ్చాడు.



బాగా తెలిసిన దారి కాబట్టి గమ్యం వైపుకు కారును పరధ్యానంగా పోనిస్తున్నాడు సాగర్. తన నుంచీ తన తల్లిదండ్రులు బలవంతంగా ఆనందాన్ని దూరంచేసినట్టుగా అతడి కనిపిస్తోంది. అతడికి చీకాకుగా వుంది. విపరీతమైన ట్రాఫిక్‌తో రద్దీగావున్న రోడ్డు అతడి చికాకును మరింతగా పెంచుతోంది.

ఉన్నట్టుండి అసంకల్పితంగానే అతడి కాలు బ్రేకును వేగంగా అణగ ద్రొక్కింది. ఉలిక్కిపడి ముందుకు చూచాడు సాగర్. కారును అలాగే ఆపేసి కంగారుగా క్రిందికి దిగివెళ్ళాడు.

ఎవరో అరవయ్యేండ్ల ముసలిది.... రక్తంతో తడిసిపోయి మాసంముద్దలా పడివుంది.... ఆమెకు స్పృహ లేదు. ఆమె చేతిసంచి దూరంగా పడివుంది.... అందులోని ఏవేవో వస్తువులు చిందర వందరగా పడివున్నాయి.

సాగర్ జడపదార్థంలా నిలుచుండిపోయాడు. చుట్టూ జనం మూగిపోతున్నారు. వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో అతడి కర్థంగావడంలేదు.

ఇంతలో కాకీదుస్తులతో, ఎర్రని టోపీతో ట్రాఫిక్ పోలీసు ముందు

కొచ్చాడు. సాగర్ వులిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు.

"మీరేం భయపడకండిసార్!.... పొరబాటు మీదేగాదు. నేను చూస్తూనే వున్నాను. ఆవిడే కన్నూ మిన్నూ చూడకుండా రోడ్డు క్రాస్ చేయబోయింది... అసలీ హాస్పిటల్ దగ్గర డ్యూటీ అంత నామర్దాపని మరొకటుండదులెండి సార్! హాస్పిటల్లోని తమ మనుషుల్ని చూడ్డానికి పల్లెటూళ్ళ నుంచీ ఎంతోమంది వస్తారా — వాళ్ళకేమీ తెలియదు. ఆకాడికీ పశువుల్ని అదిలించినట్టు అదిలిస్తూనే వున్నాను..." పోలీసు చెప్పుకుపోతున్నాడు.

అలాంటి యాక్సిడెంట్లు ఎన్నో చూసినందువల్ల అతడేం చలించడం లేదు. అది మామూలు సంఘటనగానే కనబడుతోంది అతడికి.

కానీ సాగర్ అదివరకెప్పుడూ అలాంటి ప్రమాదాన్ని చూడలేదు. రక్తపుమడుగులో పడివున్న ఆ ముసలిదాన్ని చూస్తూంటే అతడికి భరించలేని బాధ కలుగుతోంది. అలా జరగడానికి కారణం తానుగాదని చెప్పుకోజూస్తున్నా అతడి మనస్సు వినడంలేదు. ఆమెకు ట్రాఫిక్ రూల్స్ తెలియకపోవచ్చు. కానీ తాను ఏమరుపాటుగా వుండి ముందుకు చూడకుండా డ్రైవ్‌చెయ్యడం మాత్రం నిజం! రెండుచేతులూ కలిస్తేనే గానీ తప్పట్లు మ్రోగవు. ఇద్దరూ తప్పు చేయడంవల్లే ప్రమాదం జరిగింది. ఆమె చేసిన పొరబాటు పెద్దది గావచ్చు. కానీ తాను చేసిన పొరబాటు మాత్రం చిన్నదిగాదు.


అందుకే పోలీసు అవసరంలేదని వారిస్తున్నా ఎదురుగానే వున్న గవర్మెంటు హాస్పిటల్లో ఆమెను జాయిను చేయించాడు. తరఫు మనుషులెవరో హాస్పిటల్లోనే వున్నట్టున్నారు. రక్తం బాగా పోయినందువల్ల మనిషి బ్రతకడం కష్టమేనన్నారు డాక్టర్లు. బ్లడ్ ఎక్కించారు. డాక్టర్లు మృత్యువుతో పోరాడుతున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటయింది. అతనికి ఆకలి గుర్తుకురావటం లేదు. సాయంకాలం అయిదుగంటల ప్రాంతంలో 'ఇక ఫరవాలేదు.....ప్రాణ భయంలేదు' అన్నారు డాక్టర్లు.

అమ్మయ్య! గుండె కుదుటపడినట్టయ్యింది. పేషెంటు విషయంలో జాగ్రత్తగా వుండవలసిందని తెలిసిన డాక్టర్లిద్దరుముగ్గురితో చెప్పి సాగర్ ఇంటికి బయలుదేరాడు. ఇంట్లో అతని తల్లిదండ్రులుగూడా జరిగిన సంగతి తెలుసుకున్న తరువాత ఎంతో బాధపడ్డారు. మరునాటి ఉదయానికికానీ అతడు అరుణకి జరిగిన సంగతినంతా తెలియజేయడానికి వీలయిందిగాదు.

* * *

రోజులు గడిచిపోతున్నాయి.

ఆ తరువాతకూడా రెండుమూడుసార్లు




చంద్రమౌళి గీతాదేవితోబాటు ఏవేవో పిక్నిక్కులకి వెళ్ళాడు. సాగర్‌కు అలా రావడం వీలుగాదన్న సంగతి తెలుసుకున్న తరువాతెప్పుడూ చంద్రమౌళి అతణ్ణి పిలవలేదు.

ఫైనలియర్ పరీక్షలు దాదాపు ఆరు నెలల్లో వున్నాయనగా ఒకనాడు—

లైబ్రరీలోకూర్చుని ఏదో మాగజైను చదువుకుంటున్న సాగర్‌ను 'నీ కో సంగతి చెప్పాలి రమ్మంటూ" పిలిచాడు చంద్రమౌళి.

"ఇక్కడే చెప్పు" అన్నాడు సాగర్.

"ఇక్కడగాదు. కాంటీనుకు వెడదాం రా! అక్కడే చెబుతాను" అన్నాడు.

ఇద్దరూ వెళ్ళి జనసమ్మర్దం లేనిచోట కూర్చున్నారు.

సర్వర్‌తో కాఫీ తీసుకురమ్మన్నాడు చంద్రమౌళి.

అతడు తీసుకొచ్చి టేబుల్‌పైన పెట్టి వెళ్ళిపోయిన తరువాత "ఇప్పుడు చెప్పరా...." అన్నాడు సాగర్.

"ఏం చెప్పాలో బోధపడటంలేదు_" అన్నాడు అతను.

సాగర్ అతడివైపు పరీక్షగా చూశాడు.

వాడిపోయిన అతడి ముఖం, అతడెందుకో బాధపడుతున్నట్టుగా తెలియజేస్తోంది.

"నాతో చెప్పడానికి సందేహిస్తావెందుకురా చంద్రా! చెప్పు" అన్నాడు సాగర్.

సందేహించటంగాదు. .ఏంచెయ్యాలో తోచటంలేదు.. .నీ సలహా కావాలి...."

"ముందేం జరిగిందో చెప్పు . ."

"మరేంలేదు .... గీత. ..గీతకిప్పుడు మూడోనెల...."

ఉలిక్కిపడ్డాడు సాగర్.

"నిజంగా ?!"

తల వూపాడు చంద్రమౌళి.

"ఏం చెయ్యాలో తోచడంలేదు.... పరీక్షలున్నాయి. ఏదైనా నివారణమార్గం చూద్దామంటే ఆమె ఒప్పుకోవటంలేదు. పైగా ఆ మాటన్నప్పటినుంచీ నన్ను సందేహిస్తోంది. ఆమె అలా సందేహించడాన్ని భరించలేకపోతున్నాను. అందుకే నాన్నగారితో అంతా చెప్పేశాను, నేనీ అమ్మాయిని పెళ్ళ చేసుకోవడమంటూ జరిగితే నా ముఖం జన్మలో చూడనన్నారు మా నాన్నగారు. నాకేం చెయ్యాలో తోచటంలేదు... "

".... ...."

"నాకేం చెయ్యాలో తోచటం లేదురా ....నువ్వయినా చెప్పు....నన్నేం చెయ్యమంటావు ?"

కాస్సేపు ఆలోచించి "ఈ విషయంలో నేనేమీ సలహా ఇవ్వలేనురా చంద్రా! నీ మనసుకు నచ్చిన మార్గంలో పయనించు. ఈ పరిస్థితిలో వెనుకాడితే ఆమె నిన్ను అనుమానించటం సహజమే! ఆమెకు అన్యాయం జరగకుండా నువ్వేం చేసినా నా కిష్టమే !" అన్నాడు సాగర్.

రెండు మూడురోజులు అదేపనిగా ఆలోచించిన చంద్రమౌళి చివరికొక నిర్ణయానికొచ్చాడు.

చంద్రమౌళికీ, గీతాదేవికీ రిజిష్టరు మారేజి జరిగిపోయింది.


ఆ పెళ్ళికి చంద్రమౌళి తల్లిదండ్రులు ఒప్పుకోరన్న సంగతి ముందుగా నే తెలుసు. కానీ పరువు ప్రతిష్ఠలంటూ ప్రాకులాడే గీతాదేవి తల్లిదండ్రులు గూడా అందుకు తీవ్రంగా వ్యతిరేకించారని ఆ తరువాతే తెలిసింది.

ఆ రెండు కుటుంబాలకూ దాదాపు పగవారుగా మారిపోయిన నూతన దంపతులు ఒక చిన్నయింట్లో కాపురం పెట్టారు.

వాళ్ళిద్దరిదగ్గరా మిగిలిన డబ్బు ఆరు నెలలకు మాత్రమే సరిపోయింది. కాన్పు కోసం గీతాదేవి హాస్పిటల్లో జాయిన్ కావటంవల్ల పరీక్షలు రాయలేకపోయింది పరీక్షలు ముగిసిన మరునాటినుంచీ చంద్రమౌళి వుద్యోగాల వేటలో పడ్డాడు. ఎంత ప్రయత్నించినా లాభం లేకపోతోంది.

కుమారుడికి సాయం చేయకపోతే మించిపోయేదిలేదు. చంద్రమౌళితండ్రి అతణ్ణి వీలయినంతగా శిక్షించటానికే చూస్తున్నాడు. సాగర్ ఆ విషయమే తలచుకొని బాధపడ్డాడు.

"పోనీలేరా! మా నాన్నగారి ప్రభావాన్ని మైనస్‌చేస్తే మిగిలే నా అసలు



వ్యక్తిత్వపు విలువేమిటో ఇప్పుడు తెలుస్తుంది" అంటూవుంటాడు చంద్రమౌళి

ఆ విషయానికొస్తే చంద్రమౌళి తండ్రే మేలు! ఆయనకు తనకో కొడుకున్నాడన్న స్పృహైనావుంది గీతాదేవి తల్లిదండ్రులు ఆమెనుగురించి పూర్తిగా మరచేపోయారు తమ కూతురు చచ్చేపోయిందనుకుంటున్నామని చెప్పుకోసాగారు

## 4

తాను ఆలోచనల పొరల్ని చింపుకుని బయటపడేసరికి గమ్యం దాటిపోయిందన్న సంగతి అర్థమయింది సాగర్‌కు తన పరధ్యానానికి తనకే కోపం రాగా మనసులోనే ఒకసారి నవ్వుకొని కారును వెనక్కు తిప్పాడు కారు రాధాకృష్ణమూర్తిగారింటిముందు ఆగింది

హాస్పిటల్‌నుంచి వచ్చేశారేమో— మూర్తిగారు వరండాలోనే కూర్చుని పేపరు చూసుకుంటున్నారు ప్రక్కనే అరుణ కూర్చుని తండ్రితో కబుర్లు చెబుతోంది

సాగర్‌ను చూడగానే "రావోయ్ రా! కూర్చో" అంటూ ఆహ్వానించాడు ఆయన

సాగర్ కుర్చీలో కూర్చోగానే "ఏమిటీ విశేషాలు?" అని అడిగారు

కాసేపు పిచ్చాపాటీ ముగిసిన తరువాత "ఊరినుంచి మా అక్కయ్య వచ్చిందండీ అమ్మ అరుణను తీసుకురమ్మని పంపింది " అన్నాడు సాగర్

మూర్తిగారు అర్థవంతంగా నవ్వారు

అరుణ లోపలికివెళ్ళి డ్రస్సు మార్చుకొనివస్తూ కాఫీకప్పు పట్టుకొచ్చింది

"కాఫీ తాగేసి బయలుదేరండి "
అన్నాడు ఆయన

కాఫీ తాగటం ముగించి పైకిలేచి "వెళ్ళొస్తానండీ" అన్నాడు సాగర్

మూర్తిగారు తలవూపారు

ఇద్దరూ వెలుపలికివచ్చి కార్లో కూచున్నారు కారు కదిలింది

"ఈమధ్య దర్శనాలే కరువయ్యాయి" అంది అరుణ నవ్వుతూ

"ఏం చెయ్యను చెప్పు — బిజినెస్ వ్యవహారాలన్నీ నా కప్పగించేశారు నాన్నగారు. చూసుకోక తప్పుతుందా? అప్పటికీ వారానికోసారి వస్తూనే వున్నాను గదా! గడచిన వారం అర్జెంటుగా మద్రాసుకు వెళ్ళవలసి రావడంవల్ల రాలేకపోయాను అంతే!"

"ఏమిటో అంత అర్జెంటుపని? "

"ఇప్పటినుంచే సంజాయిషీలు చెప్పడం మొదలు పెట్టాలా? " అన్నాడు సాగర్ నవ్వుతూ

"మీకంత బాధగావుంటే చెప్పవలసిన అవసరంలేదు "

"మరేంలేదు చిన్న బిజినెస్ వ్యవహారం "

ఇంతలో "అరరే!" అంటూ ఆశ్చర్య పడిపోతూ కారు స్లోచేశాడు సాగర్

అతడి ఆశ్చర్యానికి కారణం తెలుసుకోవడంకోసం డోర్‌లోంచి వెలుపలికి చూసింది అరుణ

"గవర్నమెంట్ హాస్పిటల్ని చూసి అలా ఆశ్చర్య పడుతున్నారేమిటి? " అంటూ ప్రశ్నించింది విస్తుపోతూ

"హాస్పిటల్ని చూసిగాదు హాస్పిటల్ ముందు కొత్తగా స్పీడ్ బ్రేకర్ కట్టినట్టున్నారు నేనీ రోడ్డును నాలుగైదు రోజులక్రితమేమో చూశాను అప్పుడిది లేదు కొత్తగా కట్టినట్టున్నారు " అన్నాడు

" "

"దాదాపు తొమ్మిది నెలల క్రితం నేనొక ఆక్సిడెంట్ చేశానని చెప్పాను గుర్తుందా అరుణా?"


"ఉంది "

"అది ఈ హాస్పిటల్ ముందే జరిగింది సాధారణంగా యిక్కడ ట్రాఫిక్ ఎక్కువగా వుంటుంది సంవత్సరం క్రితమే దాన్ని కట్టివుంటే ఆ యాక్సిడెంట్ జరిగివుండేది గాదు పాపం, ఆ ముసలావిడ చచ్చి బ్రతికిందిప్పుడు

"ఆ సంగతి ఇంకా మరచిపోలేదా మీరు?

"ఎలా మరచిపోగలను చెప్పు హాస్పిటల్‌ను చూసినప్పుడంతా అదే గుర్తొస్తుంది ఆ రోజు నాకు బాగా గుర్తు అది మనం హార్స్లిహిల్స్‌కు వెళ్లాలనుకొని వెళ్ళలేకపోయిన రోజు "

కాసేపు మౌనంగా వుండిపోయిన అరుణ "నేనింతవరకూ గమనించనే




లేదు. వాచీ కట్టుకోలేదెందుకు ? చేయి చాలా బోసిగా వుంది" అంది.

"నిజం చెప్పనా అరుణా ?"

"…. …. …."

"మా చంద్రమౌళి కిచ్చాను…."

"ఎందుకు ?"

"ఎందుకేమిటి ? పాపం - ఈ నెల గడవాలిగా ! ఉద్యోగం ఇంకా రాలేదు. చాలా అవస్థల్లో వున్నాడు.

అరుణ మరేమీ ప్రశ్నించలేదు.

సాగరే చెప్పసాగాడు. "యిది బిజీ ట్రాఫిక్ వున్నరోడ్డు. అందులో మా హాస్పిటల్ దగ్గర జనంఎక్కువగా రోడ్డు క్రాస్ చెయ్యాలని అనుకుంటారు. కాబట్టి ఆక్సిడెంట్లు జరగడంలోఆశ్చర్యం లేదు. అక్కడ యాక్సిడెంట్లు జరగకుండా చూడాలంటే - ఆ రోడ్డుకడ్డంగా ఒక గోడకట్టి పూర్తిగా ట్రాఫిక్‌ను నివారించేందుకు ప్రయత్నించడం మంచిపని గాదు. దూకుడుగా వచ్చే వాహనాల వేగం తగ్గిస్తేచాలు. ప్రమాదాలు తగ్గిపోతాయి. ఆ పని స్పీడ్‌బ్రేకర్ చేస్తుంది.

"ఇదేమిటి ? స్పీడ్‌బ్రేకర్ ఉపయోగా గురించి చెబుతున్నారు" అంటూ నవ్వేసింది అరుణ.

"నేను చెబుతున్నది స్పీడ్‌బ్రేకర్ని గురించి మాత్రమేగాదు. చంద్రమౌళి తల్లిదండ్రులను గురించికూడా…."

"…. …. …."

"ఆరోజు హార్స్లీహిల్స్‌కు వెళ్లాలంటే వద్దన్నారని మా నాన్నగారిపైన చెప్ప లేనంత కోపంవచ్చింది. కానీ ఒకసారి వెనక్కు తిరిగిచూస్తే ఏది మంచో, ఏది చెడో యిప్పుడు తెలుస్తోంది…." అన్నాడు సాగర్.

అర్థమయిందన్నట్టుగా తలవూపింది అరుణ.